ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 6 ఫిబ్రవరి 2024




10న ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక క్యాన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం ఈ నెల 10న వయ్యాలికావల్ ఫుడ్ ఆఫీస్ సమీపాన గల సొసైటీ ప్రాంగణంలో జరగనుంది. ఈ మేరకు నగరంలో సోమవారం ఒక ప్రకటన విడుదలైంది. ఇన్ఫినేరా సహకారంతో నిర్వహించే ఈ శిబిరం ఉదయం 9-30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని సొసైటీ పేర్కొంది. శిబిరంలో బీపీ, ఆర్‌బీఎస్, వినికిడి సమస్యలు, స్థన క్యాన్సర్, దంత సమస్యలు, ఈసీజీ పరీక్షలు ఉచితంగా ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 70190 36529 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

కేంద్రంపై యుద్ధం

- పోరాటానికి సై అన్న రాష్ట్ర ప్రభుత్వం
- 'మా పన్నులు మా హక్కు' నినాదంతో పోరాటం
- రేపు ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద సీఎం ఆధ్వర్యంలో నిరసన
- కలసి రావాలని ప్రతిపక్షాలకు సిద్ధూ పిలుపు


విధానసౌధలో మీడియాతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్ తదితరులు



బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంపై యుద్ధానికి రాష్ట్ర ప్రభుత్వం సై అంటోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల వ్యవధిలో కేంద్రం నుంచి తీవ్రమైన అన్యాయం జరుగుతోందని, గ్రాంట్లు, జీఎస్టీ వాటా, కరువు సాయం, గడిచిన బడ్జెట్‌లో కేటాయింపులకు సంబంధించి నిధులు విడుదల కావడం లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తరచూ విమర్శలు చేస్తున్నారు. సాయం కోసం కేంద్రం పెద్దలతో రాష్ట్రం తరపున ముఖ్యమంత్రితోపాటు పలువురు మంత్రులు చర్చలు జరిపారు. ఇలా సాగుతున్న తరుణంలోనే లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ రాజకీయం కూడా తోడైంది. ఈనెల 7న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ కలసి నిరసనకు సిద్ధమయ్యారు. కేంద్రప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తరచూ విమర్శలు చేసే సీఎం సిద్దరామయ్య ఢిల్లీలో పోరాటానికి కారణాలను సమగ్రంగా వివరించారు. సోమవారం విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి నిరంతరంగా అన్యాయం జరుగుతోందని, సాయంలో తేడా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్ర జలు తమకు ఇచ్చిన అవకాశానికి న్యాయం చేయడం తమ కర్తవ్యమన్నారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్రం సహకరిస్తుందని నెలల కాలంగా సహనంతో ఉన్నామన్నారు. గత బడ్జెట్‌లో హామీలను అమలు చేస్తారని భావించామని, ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్రానికి చేదోడుగా ఉంటారని ఆశించామన్నారు. కన్నడిగులకు జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే పార్టీలకు అతీతంగా 'మా పన్నులు మా హక్కు' పేరిట పోరాటానికి ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రానికి నిరంతరం అన్యాయం

భద్ర ఎగువ ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు గత ఏడాది బడ్జెట్‌లో ప్రకటించారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. 10 నెలలు ముగిసినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు ఉందని, 95 శాతం తాలూకాల్లో కరువుగా ప్రకటించామని తెలిపారురు. ఖరీఫ్, రబీలో పంటలసాగు కనీస స్థాయిలో కూడా జరగలేదన్నారు. కేంద్ర కరువు అధ్యయన బృందాలు పరిశీలించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు సాయం విడుదల కాలేదన్నారు. కరువు కారణంగా ఉపాధి కూలీలకు 150 రోజులకు పనిదినాల పెంచాలని విన్నవించినా కేంద్రం అంగీకరించలేదన్నారు. ఇలాంటి ఎన్నో అన్యాయాలు సహించుకునే దేశ ప్రజలందరికీ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని తెలపాలనే ఢిల్లీలో పోరాటానికి సిద్ధమయ్యామన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రాల నుంచి సెస్, పెట్రోల్, డీజిల్, సర్ చార్జ్ సహా పలు విధాల పన్నులు సేకరిస్తుందని సీఎం పేర్కొన్నారు. 14వ ఫైనాన్స్ కమిషన్‌లో రాష్ట్రం వాటా 4.71శాతం ఉండగా 15వ ఫైనాన్స్ కమిషన్ నాటికి 3.64 శాతానికి తగ్గిందన్నారు. నాలుగేళ్లలో రాష్ట్రానికి రూ. 45వేల కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. ఫైనాన్స్ కమిషన్‌ల ద్వారా నగదు బదిలీలో 1.07 శాతం తక్కువైనందున రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని సర్దుబాటు చేసేందుకు రూ.5,495 కోట్లు ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలని సిఫారసు చేశామన్నారు. మధ్యంతర బడ్జెట్‌లో సిఫారసు చేశామని, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ తిరస్కరించారన్నారు. పెరిఫెరల్ రింగ్‌రోడ్డుకు రూ.3వేల కోట్లు, చెరువుల అభివృద్ధికి రూ.3వేల కోట్లు విడుదల చేయాలని సిఫారసు చేసినా ఇంతవరకు రాలేదన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా రాష్ట్రానికి రూ. 62,098 కోట్లు, ప్రత్యేక గ్రాంట్ల రూపంలో రూ.11,495 కోట్లతో కలిపి రూ.73,593 కోట్ల నష్టం జరిగిందన్నారు.

జీఎస్టీలోనూ అన్యాయమే..

జీఎస్టీలోనూ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఏటా రూ.4.30 లక్షల కోట్లు పన్నులు వస్తాయన్నారు. దేశంలో మహారాష్ట్ర తర్వాత కర్ణాటకనే అత్యధికమన్నారు. రూ.4.30 లక్షల కోట్లు రాష్ట్రం నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో వెళ్తోందని, ఈ ఏడాది పన్నులు, కేంద్రప్రభుత్వ గ్రాంట్లతో కలిపితే రూ. 50,257 కోట్లు మాత్రమే వచ్చిందన్నారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వంద రూపాయలు వెళ్తే తిరిగి 12 లేదా 13 రూపాయలు వాపసు వస్తోందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి మహదాయికి అనుమతులు రాలేదని, భద్రకు నిధులు విడుదల కాలేదని, మేకెదాటు ప్రాజెక్టు ముందుకు కదలలేదని వీటన్నింటికీ కేంద్రం బాధ్యత కాదా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు ద్వారా పంటలకు రూ.35వేల కోట్ల నష్టం జరిగిందని, రూ.17,901 కోట్లు పరిహారం ఇవ్వాలని కోరామన్నారు. ఢిల్లీలో ప్రధానిని కలసి వివరించినా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యురాలిగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతినిధ్యం వహిస్తున్నా అన్యాయమే జరుగుతోందన్నారు.

రాష్ట్రం కోసం ప్రతిపక్ష నేతలను ఆహ్వానించాం : సీఎం

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కలసి పోరాటం చేద్దామని బీజేపీ, జేడీఎస్ ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. తాము బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయలేదని, రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం నుంచి జరుగుతున్న నష్టం కోసమే తమ ఆందోళన అన్నారు. ఢిల్లీలో పోరాటం చేయడం ద్వారానైనా రాష్ట్రానికి ప్రధాని నరేంద్రమోదీ న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజ రాయరెడ్డి, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎల్‌కే అతీక్ ఉన్నారు.

ఢిల్లీ ధర్నా వెనుక భారీ వ్యూహం

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమైంది. ఈనెల 7న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు దిగడం వెనుక భారీ వ్యూహమే ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక గ్రాంట్లు లేకపోవడంపై రాష్ట్రానికి చెందిన ఏకైక కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ ప్రత్యేకదేశం నినాదాన్ని తెరపైకి తెచ్చారు. డీకే సురేశ్‌కు మద్దతు ఇచ్చేలా ఉపముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు ఈ అభిప్రాయాన్ని మద్దతుగా మాట్లాడారు. ప్రత్యేక దేశం నినాదం పార్లమెంటులో ప్రస్తావనకు రావడం దేశమంతటా కాంగ్రెస్‌కు మచ్చలా మారింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రత్యేక దేశం నినాదాన్ని తీవ్రంగా ఖండించారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఈ వివాదం మరింత ముందుకెళ్తే పెను ప్రమాదమని పార్టీ నేతలు భావించినట్టు తెలుస్తోంది. అందుకే 'మా పన్నులు మా హక్కు' నినాదంతో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా కర్ణాటక ప్రభుత్వం ఢిల్లీలో పోరాటం చేయడం ద్వారా బీజేపీయేతర రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందనే సందేశాన్ని ఇవ్వదలిచారు. 8 నెలల క్రితం రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల వేళ అప్పటి బీజేపీ సీఎం బసవరాజ్ బొమ్మై ఫొటోతో పేసీఎం పేరిట ప్రచారం చేశారు. ఇది రాష్ట్రమంతటా తీవ్రమైన చర్చ జరిగింది. ఎన్నికల్లో పేసీఎం అంశం కాంగ్రెస్‌కు బాగా కలిసొచ్చింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు కావడంతో దేశ వ్యాప్తంగా పార్టీకి అనుకూలంతోపాటు కేంద్రప్రభుత్వ ఏకపక్ష ధోరణి అంశాన్ని చాటేలా ఢిల్లీ పోరాటం వ్యూహంగా ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

12 నుంచి శాసనసభ సమావేశాలు

- తొలిరోజు గవర్నర్ ప్రసంగం
- 16న రాష్ట్ర బడ్జెట్
- స్పీకర్ యూటీ ఖాదర్

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతాయని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ వెల్లడించారు. సోమవారం విధానసౌధలో స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ ఉభయసభలను ఉద్దేశించి తొలిరోజు గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ ప్రసంగిస్తారని తెలిపారు. శాసనసభ సమావేశాలు రెండు వారాల పాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈనెల 16న 2024- 25 ఆర్థిక సంవత్సరానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆర్థికశాఖ మంత్రి హోదాలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారని చెప్పారు. సభా కలాపాలు పదిరోజులు కొనసాగుతాయని వెల్లడించారు. శాసనసభ సమావేశాలకు ముందుగా ఈనెల 9న బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎమ్మెల్యేలు, పాత్రికేయులకు ప్రత్యేక వర్క్‌షాప్ ఉంటుందని తెలిపారు. పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తారని వివరించారు. శాసనసభ కలాపాలు, బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై నిపుణులతో శిక్షణలు ఉంటాయన్నారు.


మీడియాతో స్పీకర్ యూటీ ఖాదర్

ఏపీలో టీడీపీకి అధికారం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభకు త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి అభిమాని సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో బెంగళూరులో ఉంటున్న ఉదయగిరి నియోజక వర్గ ప్రజలు, ప్రవాసాంధ్రుల కోసం కల్యాణనగర్‌లోని కొంకణ సముదాయంలో సీనియర్ నాయకులు కూండ్ల వెంకటేశ్వరరావు, కాకర్ల హుస్సేన్ నాయుడు, దుత్తలూరి మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం పర్యవేక్షణలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లినేని వెంకట రామారావు మాట్లాడుతూ ఏపీలో జరుగుతున్న అరాచక పాలనపై నగరంలో ఉంటున్న ఉదయగిరి వాసులు రాజీలేని పోరాటాలు జరుపుతుండటం సంతోషదాయ కమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తమ నియోజకవర్గాల్లో ఓట్లు సురక్షితంగా ఉన్నాయో లేదో చూసుకోవాలని ఆయన ప్రవాసాంధ్రులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాక్షసత్వం రాజ్యమేలుతోందని ప్రజలు గతంలో ఎన్నడూ లేని విధంగా నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఏపీలో తెలుగుదేశాన్ని తిరిగి అధికారంలోకి తెస్తేనే ఈ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి లభిస్తుందన్నారు. టీడీపీని అధికారంలోకి తెచ్చేంతవరకు విశ్రమించబోమంటూ తెలుగుదేశం ఫోరం సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ప్రవాసాంధ్రులు అడిగిన పలు ప్రశ్నలకు బొల్లినేని వెంకటరామారావు సమాధానాలు చెప్పడమే కాక వారి సమస్యలను ఆలకించారు. సమావేశంలో కొండాపురం మండల పార్టీ అధ్యక్షుడు ఓంకార్, వరికుంట పాడు మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, ఉదయగిరి నియోజకవర్గం పరిశీలకుడు వికాస్, యువనేత బొల్లినేని ధనుష్, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి చంద్ర అబ్బయ్యనాయుడు, నేతలు మద్దినేని మోహన్‌రావు, కురుగొండ్ల దామోదర్, వీరాస్వామి, పుల్లెల నాగేంద్ర, మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, మల్లంపాటి గురవయ్యనాయుడు, గుండాల కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, కూండ్ల వెంకటేశ్వర్లు, బాలయ్య, ముజ్జె లక్ష్మీనారాయణ, వెంకటరమణ, శ్రీసాయి తదితరులు పాల్గొన్నారు.


వేదికపై టీడీపీ నాయకులు


సమావేశంలో పాల్గొన్న అభిమానులు

పరీక్షల పట్ల భయం వద్దు

- ఎస్ఎస్ఎం విద్యార్థులకు ఎమ్మెల్యే సూచన

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పరీక్ష పట్ల భయం వద్దని, కష్టపడి చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చునని బసవనగుడి ఎమ్మెల్యే రవిసుబ్రహ్మణ్య సూచించారు. ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదోతరగతి ఓ మైలురాయి లాంటిదన్నారు. ఇక్కడ సాధించే మార్కులే కీలకమవుతాయని పేర్కొన్నారు. పదోతరగతి దాకా అన్ని సబ్జెక్టులు చదువుతారని, తర్వాత ఎంపిక చేసుకున్న అంశాలలోనే లోతుగా అభ్యసిస్తారని తెలిపారు. తర్వాత వృత్తి విద్యాకోర్సులకు వెళ్లి వాటి ద్వారానే ముందుకెళతారన్నారు. పరీక్షలంటే భయంగా కాకుండా నిత్యం ప్రణాళికా బద్ధంగా చదవాలన్నారు. పీఈఎస్ యూనివర్సిటీ డైరెక్టర్ ఎంవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రక్షావర్మ ప్రసంగించారు. వార్షికోత్సవ సందర్భంగా రాణించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.


ఎస్ఎస్ఎం స్కూల్ వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రకృతి సంరక్షణ మనందరి కర్తవ్యం కావాలి

- హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ సుభాష్ అడి పిలుపు

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దేశ పౌరులందరి కర్తవ్యం కావాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అధ్యక్షుడు జస్టిస్ సుభాష్ అడి పిలుపునిచ్చారు. బన్నేరుఘట్టరోడ్డులోని ఏఎంసీ కళాశాలలో రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి సహకారంతో సోమవారం ఏర్పాటు చేసిన ఇండో యూఎస్ సారథ్యంలో జరిగిన సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. మన రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కుల్లో పర్యావరణ సంరక్షణ ఒకటని తెలిపారు. ప్రతి పౌరుడు దీన్ని పాటించాలన్నారు. భోపాల్ గ్యాస్ లీకేజ్ దుర్ఘటన జరిగి సంవత్సరాలు గడిచినా నేటికీ దాని దుష్పరిణామాలను ప్రజలు అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. పర్యావరణ సంరక్షణలో లోటుపాట్ల వల్లే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. అడవులను యథేచ్ఛగా నరికివేస్తుండడంతో మానవులు, ప్రాణుల మధ్య ఘర్షణ జరుగుతోందని వివరించారు. సాంకేతిక రంగంలో శరవేగంతో అభివృద్ధి సాధిస్తున్నామని, ఇదే సమయంలో మనకు ఆక్సిజన్ అందించే చెట్ల విషయానికి వచ్చేసరికి ఘోరమైన నిర్లక్ష్యం వహిస్తున్నామని పేర్కొన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ రాంకూర్ విశ్వనాథ్, అమెరికా సీహెచ్ఎంఎం ప్రిన్సిపాల్ కెన్రాస్ కోయెల్, ఏఎంసీ కళాశాల చైర్మన్ డాక్టర్ కేఆర్ పరమహంస, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు రాహుల్ కల్లూరి తదితరులు పాల్గొన్నారు. నేటి జీవన క్రమంలో పర్యావరణ సంరక్షణ పెను సవాల్‌గా ఉందని, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు బాగా దోహదపడతాయని, ఏఎంసీ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేఆర్ పరమహంస అనంతరం మీడియాతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు.



సదస్సు ప్రారంభంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ అడి తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.17	1,614.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	271	9,832
సామర్థ్యం (టీఎంసీలు)	9.57	47.99

జాతరకు బియ్యం అందజేత

కంప్లి, ఫిబ్రవరి 5 : రాజానళ్లి వాల్మీకి జాతరకు కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ ఆరు టన్నుల బియ్యాన్ని అందజేశారు. సోమవారం వాల్మీకి సర్కిల్‌లో బియ్యం లోడును తరలింపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంప్లి నియోజకవర్గం, కురుగోడు ప్రాంత వాల్మీకులు జాతరను ఘనంగా జరుపుకోవాలన్నారు. మనస్పర్థలు వదిలి ఈ జాతరను రాష్ట్రంలో గుర్తింపు వుండేలా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హంపే దేవనళ్లి హులిగప్ప, మరలింగప్ప, ఈరణ్ణ, లక్ష్మణ్ణ, వెంకటేష్ బర్మక్క, అంబన్న, ఈరణ్ణ, రామాంజనేయులు, రాఘవేంద్ర, వీరేష్, దేవరాజు, శేఖర్,వెంకటేష్, సుధాకర్ పాల్గొన్నారు.

బళ్లారిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 5: బళ్లారి నగరాన్ని డీఎంఎఫ్ గ్రాంట్ నిధులతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి పేర్కొన్నారు. బళ్లారి నగరంలోని 35వ వార్డు ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సోమవారం జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా మినరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 220 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన పాఠశాల గదుల ప్రారంభోత్సవం, రిఫ్రిజిరేటర్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ చిన్నారులకు మంచి చదువుతో పాటు మంచి ఆహారం అందించాలని, అప్పుడే విద్య అనే ప్రాథమిక కోరిక నెరవేరుతుందన్నారు. కొత్తగా 34 అంగన్‌వాడీలు నిర్మిస్తామని, నగరంలో ప్రైవేట్ ప్లే స్కూల్ తరహాలో అత్యాధునిక మోడల్ అంగన్‌వాడీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పిల్లలను అంగన్‌వాడీ కార్యకర్తలు సొంత బిడ్డల్లా చూసుకుంటారని, ప్రతి బిడ్డను దేశం కోసం జ్యోతిలాగా పెంచే వారిని మాతాశ్రీ అని పిలిచి గౌరవించాలన్నారు. 35వ వార్డుకు రూ.5కోట్లతో ఎస్టీ హాస్టల్ మంజూరయ్యిందని, ఇప్పటి వరకు బళ్లారి నగర నియోజకవర్గానికి వివిధ పనులతో కలిపి సుమారు రూ.65కోట్లు మంజూరు చేశానని, రానున్న మూడేళ్లలో బళ్లారిని రాష్ట్రంలోనే మోస్ట్ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన మేయర్ శ్వేత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు రిఫ్రిజిరేటర్లు ఇవ్వడం గర్వకారణమని, కేంద్రాల్లో పిల్లలకు పండ్లు, కూరగాయలు వంటి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఈఆహారాన్ని భద్రపరిచేందుకు వాటిని ఉపయోగిస్తామన్నారు. డిప్యూటీ మేయర్ జానకమ్మ మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల కంటే అంగన్‌వాడీ కార్యకర్తలదే బాధ్యత, చిన్న పిల్లలను చూసుకోవడం చాలా కష్టమైన పని పిల్లల పెంపకం తల్లిదండ్రులకు భారంగా ఉంటుంది. అంగన్‌వాడీ కార్యకర్తల పని ముఖ్యమన్నారు. నగరంలో చాలా అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇలాంటి భవనాలను గుర్తించి శాశ్వత భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యేలను కోరారు. పేదలకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ సందర్భంగా 35 వవార్డు మించు శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు సుబ్బరాయుడు, హొన్నప్ప , జగన్, గోవింద, మహ్మద్, పాలకమండలి సభ్యులు ప్రభంజన్‌కుమార్, నూర్ మహ్మద్, రామాంజనేయులు, పేరంవివేక్, కేబేరా, స్థానిక నాయకులు గజన్న, మోహన్‌దాస్, శేఖన్న, మారుతీ, ప్రధాన ఉపాధ్యాయులు హొన్నూరబీ, ఉపాధ్యాయులు మేరీ, రోషని, ఉచ్చంగమ్మ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ గదులను ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జనజాగృతి ర్యాలీ

సిరుగుప్ప, ఫిబ్రవరి 5 : రాజ్యాంగ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి అభివృద్ధి బాటలో నడవాలని తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం తాలుకాలోని కురువళ్లి, బగ్గూరు, రావిహాళ, రారావి వివిధ గ్రామాలలో రాజ్యాంగ జన జాగృతి ర్యాలీ జరిగింది. ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో అన్ని వర్గాల అభివృద్ధికి అంశాలను ఎంతో చక్కగా రూపొందించారన్నారు. వాటిని చదువుకుని ప్రభుత్వ పథకాలను పొందాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షులు, సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి : ఎమ్మెల్యే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, ఫిబ్రవరి 5 : డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ సూచించారు. కంప్లిలోని తమ కార్యాలయంలో పరిశిష్ట జాతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజర్వేషన్ల వల్ల ఎందరో బడుగులకు అధికారం సాధ్యమ య్యిందన్నారు. బీజేపీ నాయకులు అయోధ్య రామమందిరం పేరుతో కుట్రలు, కుల, మతాల విభేధాలతో ఘర్షణలు చేపడుతున్నారన్నారు. అనంతరం గానం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో గెలిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. విద్యాసాగర్ పాఠశాలకు చెందిన సుమన్‌గౌడ డ్రాయింగ్‌లో రాణించి ప్రథమ బహుమతి గెలుపొందారు. రాథోడ్, వైశాక్, గ్రామీణ విభాగం జిల్లా అధ్యక్షులు వీరాంజనేయులు, శ్రీనివాస రావు, హబీబ్ రెహ్మాన్, సయ్యద్ ఉస్మాన్, లడ్డూ వన్నూర్ వలీ, బట్టా ప్రసాద్, షణ్ముఖప్ప, సత్యప్ప పాల్గొన్నారు.

త్వరలో రాయచూరు నగరసభ అప్‌గ్రేడేషన్

● పురపాలక శాఖ మంత్రి రహీం ఖాన్

రాయచూరు, ఫిబ్రవరి 5 : దినదిన అభివృద్ధి చెందుతున్న రాయచూరు నగరసభను అప్‌గ్రేడేషన్ చేసేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి రహీం ఖాన్ తెలిపారు. నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల విస్తృత సమావేశంలో పాల్గొని మంత్రి మాట్లాడారు. రాయచూరు నగరసభ అప్‌గ్రేడేషన్‌కు సంబంధించి ఇప్పటికే మంత్రి వర్గంలో మూడు సార్లు ప్రస్తావచినట్లు ఆయన వివరించారు. విషయాన్ని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని త్వరలోనే నిర్ణయం తీసుకుంటారన్నారు. కాగా రాయచూరు నగరసభగా ఉన్నందువల్ల అభివృద్ధికి సంబంధించి రూ.10 కోట్లు విడుదలవుతున్నాయని అదే వెనక అప్‌గ్రేడేషన్ జరిగితే రూ.50 కోట్ల వరకు అందే అవకాశం ఉంటుందన్నారు. దీంతో పాటు జిల్లాలో ధీర్ఘకాలంగా పార్టీకి సేవలందించే నాయకులకు నామినేటెడ్ పదవులు అందించేందుకు ముఖ్యమంత్రి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఇప్పటికే ఆశావాహులను గుర్తించి వారికి సముచిత స్థానం కట్టుబెట్టేందుకు ప్రభుత్వ పరంగా ప్రయత్నం జరుగుతున్నట్లు తెలిపారు. వచ్చే లోకసభ ఎన్నికలను పార్టీ శ్రేణులు సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. లోకసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమైక్యంగా పని చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే క్షేత్ర స్థాయి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి రహీం ఖాన్

●నగర స్వచ్ఛత అభివృద్ధికి మంత్రికి వినతి

చారిత్రక నేపథ్యం ఉన్న రాయచూరు నగరంలో స్వచ్ఛత పనులతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ సామాజిక వేత్త, ఉద్యమకారుడు డాక్టర్ రజాక్ ఉస్తాద్ మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. సోమవారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి రహీం ఖాన్‌ను కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. 15వ ఆర్థిక సంఘం చేపట్టిన అనేక పనులు ఇప్పటికి అసంపూర్తిగానే మిగిలిపోతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో పాటు నగరంలో స్వచ్ఛత పూర్తి నాసిరకంగా ఉండడంతో ప్రజలు దుర్వాసన అపరిశుభ్రతలకు గురవుతు రోగాల బారిన పడుతున్నట్లు మంత్రికి తెలిపారు. ఆదాయ పరంగా జనాభ పరంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాయచూరులో అందుకు తగిన సౌకర్యాలు లేకపోవడం సమస్యగా మారిందన్నారు. వ్యర్థాల నిర్వహణలను నగర సభ అధికారులు, పాలక మండలి పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నట్లు మంత్రికి ఫిర్యాదు చేశారు. రాయచూరు నగరాన్ని ప్రత్యేక అవసరాలు ఉన్న నగరంగా గుర్తించి నిధులు విడుదల చేయాలని కోరారు. అదే సమయంలో ఉత్తర కర్ణాటక ప్రాంతంలో అతి పెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్న రాయచూరు దినదిన అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కనీస సౌకర్యాల కోసం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసి నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. వర్షభావ పరిస్థితిల వల్ల తలెత్తిన తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని ఏ నగరంలోను పట్టణ పరిధిలోను తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, వక్ఫ్‌బోర్డు శాఖ మంత్రి రహీం ఖాన్ ఆదేశించారు.

మదర్ కార్డు ప్రాముఖ్యతపై అవగాహన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 5: మదర్ కార్డు వినియోగించుకుని గర్భిణులు అన్ని సేవలను ఉచితంగా పొందవచ్చని, ప్రతి మంగళవారం అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వాటి ప్రాధాన్యతను వివరిస్తున్నామని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. మంగళవారం మదర్ కార్డుల నమోదును పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ గర్భిణులు 12వారాలలోగా కార్డులో పేరు నమోదు చేసుకోవాలని, ఆయుష్మాన్ భవ మేళాలో సంబంధిత గర్భిణికి మదర్‌కార్డు అందించడంతో పాటు కార్డులో నమోదు చేసిన సమాచారాన్ని అందరికీ తెలియజేస్తున్నామన్నారు. గర్భిణులకు ప్రసవానికి ముందు అన్ని ఇంజక్షన్లు రక్తపోటు, మధుమేహం వంటి జీవనశైలీ వ్యాధులను పరీక్షిస్తారు. ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్‌తో ఆసుపత్రిలో ఓచర్‌లను తీసుకుని శిబిరంలో పాల్గొనాలన్నారు.



మదర్‌కార్డులో పేర్లు నమోదుచేస్తున్న ఆరోగ్య సిబ్బంది

యథేచ్ఛగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా

● స్థానికంగా కొనుగోలు చేసి కర్ణాటక తదితర ప్రాంతాలకు... ● పట్టుకోవడంలో పోలీసులు విఫలం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5: రేషన్ బియ్యం అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. చౌకధాన్యపు డిపోల నుంచి పేదలకు అందాల్సిన బియ్యం వ్యా పారంగా మారిపోయింది. కిలోల నుంచి టన్నుల వరకు పెద్ద మొత్తంలో విక్రయిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా కొనుగోలు చేసి రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యం కిలో రూ.15 నుంచి రూ.20 వరకు డిమాండ్ ఉంది. కొన్ని ప్రాంతాల్లోని రేషన్‌షాపుల్లో బియ్యం సరిగా పంపడం లేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో చాలా మంది రేషన్‌డీలర్ల నుంచే అక్రమార్కులకు బియ్యం అందుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. సరిహద్దు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు బియ్యం సరఫరా అవుతోంది.



కిలో రూ.15 నుంచి రూ.20 వరకు...

చౌకధాన్యపు డిపోల నుంచి పేద ప్రజలకు అందే బియ్యం పక్కదారి పట్టడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల నుంచి బియ్యం సేకరిస్తుంటారు. గత ఏడాది డిసెంబరు నెలాఖరులో రాప్తాడు మండలం హంపాపురం సమీపంలో విజిలెన్స్ రెవెన్యూ అధికారులు బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. 630 సంచులతో ఉన్న 320 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

అనంతపురం పంగల్‌రోడ్డులో కీలకంగా ఓ మిల్

అనంతపురం నగరంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి పీడీఎస్ బియ్యం నేరుగా ఆ మిల్‌కే చేరుకుంటుంది. పదులు, వందల కేజీలు కాదు ఏకంగా వేలటన్నుల్లో బియ్యం చేరుకుంటోందని సమాచారం. నగర శివారులోని పంగల్‌రోడ్డులో ఓ మిల్ ఇందుకు ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక్కడ ఆ బియ్యాన్ని పాలిష్ చేయించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తుంటారు. అక్కడ మంచి ధరకే విక్రయించి బాగానే సొమ్ము చేసుకుంటారని తెలుస్తోంది.

మూలాలను పట్టుకోవడంలో పోలీసుల విఫలం...

కొన్ని సంవత్సరాల నుంచి పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో బియ్యం పట్టుబడినా, సంబంధిత వారు అరెస్టయినా అక్రమ రవాణా ఆగడం లేదు. దీనికి ప్రధాన కారణం అసలైన మూలాలను పట్టుకోలేకపోవడమేనని తెలుస్తోంది. ఇందులో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. విజిలెన్స్, సెబ్, పోలీసులు ఇన్ని విభాగాలు దృష్టి సారిస్తున్నా బియ్యం అక్రమ రవాణాను నియంత్రించలేకపోతున్నారు. యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా పట్టించుకోకపోవడానికి ముడుపులు అందుతుండటమే కారణమని తెలుస్తోంది. పోలీసులు ఎప్పుడు నిఘా పెడతారో వేచి చూడాల్సిందే.

భక్తితో దేవున్ని పూజించాలి : స్వామీజీ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 5: భక్తిశ్రద్ధలతో భగవంతుడిని పూజిస్తే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భీమనకట్టి భీమసేతు మునివృంద మఠం రఘువరేంద్ర తీర్థ స్వామీజీ పేర్కొన్నారు. సోమవారం శ్రీ పురందర దాస సప్తరాత్రోత్సవాలు, శ్రీ మధ్వ నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని నగరంలోని సత్యనారాయణపేట జమకండి వాదిరాజ మఠంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేవున్ని నమ్ముకుంటే ఎన్నటికీ ఆత్మవిశ్వాసం కోల్పోరని, అన్నీ ఆటంకాలను తొలగించుకుని ప్రశాంతమైన జీవితాన్ని సృష్టించుకోవచ్చన్నారు. కార్యక్రమానికి రాఘవేంద్ర స్వామి మఠం మేనేజర్ నరహరి ఆచార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. 15 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజూ నలుగురు స్వాములు పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా మధ్వసంఘం ఆఫీస్ బేరర్లు సుబ్రహ్మణ్య, రామమూర్తి, సుశీలేంద్ర, కిషన్‌రావు, లక్ష్మణ్, నరసింహమూర్తి, నారాయణాచార్, వ్యాసరావు, శ్రీధర్, రవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పురందర దాసు ఆరాధనోత్సవం సందర్భంగా ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంగీత పోటీలు,ప్రబంధ పోటీలు, సామూహిక భజన నిర్వహించారు.



మాట్లాడుతున్న రాఘవేంద్ర తీర్థ స్వామి తదితరులు

హోసూరు జోన్

రహదారులను కప్పేస్తున్న పొగమంచు



హెడ్‌లైట్లతో నడుస్తున్న వాహనాలు

హోసూరు, ఫిబ్రవరి 5: హోసూరు ప్రాంతాల్లో పొగమంచు విపరీతంగా కురుస్తుండటంతో జాతీయ రహదారిపై వాహనాల సంచారానికి అంతరాయం నెలకొంది. ఉదయం 7, 8 గంటలైనా హెడ్ లైట్లు వెస్తూ వాహనాలు నడుపుతున్నారు. హోసూరు పరసర ప్రాంతాల్లో ఉదయం వేళ ఎక్కువగా మంచు కురుస్తోంది. బెంగళూరు - కృష్ణగిరి జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులపై తెల్లటి పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు నిదానంగా రాకపోకలు సాగిస్తున్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు, కర్మాగారాలకు వెళ్లే ఉద్యోగులు సకాలంలో చేరుకునేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైభవంగా సపలమ్మ జాతర



పరుషలో పాల్గొన్న ఎద్దులతో స్థానిక ప్రముఖులు

హోసూరు (మత్తిగిరి), ఫిబ్రవరి 5: పట్టణానికి సమీపంలోని తిమ్మసంద్రం గ్రామంల్లో ఎడ్ల పండుగ వైభవంగా జరిగింది. 200 సంవత్సరాలకు పైగా సపలమ్మ ఆలయ జాతరలో భాగంగా ఎడ్ల పరుష నిర్వహిస్తారు. దేశవాళీ ఆవుల క్రయ విక్రయాలు సాగుతుంటాయి. తమిళనాడు నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరిల నుంచి కూడా పలువురు వ్యాపారులు పరుషలో పాల్గొన్నారు. ఇక్కడ ఒక జత ఆవులు కనీస ధర రూ.1 లక్ష నుంచి ప్రారంభ అవుతుంది. ఒక్కో జత ఎద్దులు రూ.5 లక్షల దాకా అమ్ముడయ్యాయి. ఆరు రోజులు పాటు పరుష కొనసాగనుంది. ఈనెల 11తో జాతర ముగియనుంది. ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూంటారు. ఉత్సవాల్లో సపలమ్మ ఆలయం ఫౌండేషన్ ఛైర్మెన్ గజేంద్ర మూర్తి, ఉపాధ్యక్షుడు త్యాగరాజ్, కృష్ణప్ప, మునిరాజ్, మహేశ్, కెంపన్న నటరాజ్ పాల్గొన్నారు.

తగ్గిన పూల ధరలు

హోసూరు, ఫిబ్రవరి 5: హోసూరు బస్టాండు పూల మార్కెట్‌ల్లో పూల ధరలు బాగా తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. బంతిపూలు, బటన్ రోజా, గులాబీ, చెండుమల్లి, కనకాంబరం, సంపంగి, తదితర పూలు సాగు చేస్తున్నారు. పండుగరోజులు, ఇతర పర్వదినాలలో మాత్రమే కొంత డిమాండ్ ఉంటోందని సాధరణ రోజుల్లో కనీస ధర లేకపోవడంతో నష్టం చవిచూస్తున్నామని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. కనీస ధర కల్పించడం ద్వారా ఆదుకోవాలని కోరుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రోజా పూలు

ద్విచక్ర వాహనం, బస్సు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

హోసూరు (మత్తిగిరి), ఫిబ్రవరి 5: పిల్లలతో కలసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రైవేట్ ఫ్యాక్టరీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. హోసూరు సమీపంలోని నంజాపురం గ్రామానికి చెందిన సురేశ్‌కణ్ణన్ (45), కుమారుడు ముఖష్ (12), కుమార్తె సుగుణ (14) తో కలసి అందివాడి ప్రాంతంలోని పాఠశాలకు బయల్దేరాడు. ఉద్యోగులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు, ద్వి చక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మార్గంలో గడిచిన రెండు నెలల్లో దాదాపు 30 ప్రమాదాలు జరిగాయని, వీటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాస్తారోకో చేశారు. మత్తిగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపచేశారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదస్థలంలో గుమికూడిన స్థానికులు

స్త్రీ శక్తి సంఘాలకు మార్కెట్ ఏర్పాటు చేయాలని వినతి

కంప్లి, ఫిబ్రవరి 5 : స్త్రీశక్తి మహిళలు తాము సొంతంగా అల్లిన బుట్టలు, గంపలు, అగరబత్తీలు ఇతర సామాగ్రిని విక్రయించుకునేందు కోసం ప్రతి తాలుకాలో ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలని సంఘం సభ్యురాలు నాగరత్న కోరారు. బుక్కసాగర గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటాపురంలో స్త్రీశక్తి మహిళలు తాము అల్లిన బుట్టలను విక్రయించేందుకు మార్కెట్లు లేక రోడ్లపైనే అమ్మకాలు చేసే పరిస్థితి ఏర్పడిందని, అలా కాకుండా ఇటు ప్రభుత్వాలు, అధికారులైనా కొనుగోలు చేయాలని లేకపోతే తయారు చేసే ఇళ్ల వద్దకే వ్యాపారస్తులు వెళ్లి కొనుగోలు చేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తమకు ప్రోత్సాహం అందిస్తే మరిన్ని గృహ వస్తువులు తయారు చేసి జీవనం గడుపుతామన్నారు.



వెంకటాపురం క్యాంపులో బుట్టలు విక్రయిస్తున్న మహిళలు

ఏడాదిలో వెయ్యి కొత్త బస్సులు

▸▸ ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో వెయ్యి కొత్త బస్సులను సమకూర్చడం ద్వారా రవాణాను మరింత సరళీకృతం చేయదలిచామని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. విధానసౌధ ప్రాంగణంలో సోమవారం 100 అశ్వమేధ కేఎస్ఆర్టీసీ బస్సులను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేఎస్ఆర్టీసీకి మరో వెయ్యి బస్సులు సమకూరుస్తామన్నారు. నాలుగు కార్పొరేషన్‌లకు బస్సులను పెంచదలిచామన్నారు. కొవిడ్ వేళ 3,800 సర్వీసులు రద్దు చేశారని, మేం అధికారంలోకి వచ్చాక 5,800 బస్సులను పెంచామన్నారు. సిబ్బందికి కోటి రూపాయల బీమాను అందిస్తున్నామన్నారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా శక్తి గ్యారెంటీని అమలు చేశామని తద్వారా మహిళలు ఉచితంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణాలు సాగిస్తున్నారన్నారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రి రామలింగారెడ్డి, కేఎస్ఆర్టీసీ చైర్మన్ గోపి శ్రీనివాస్, ఎమ్మెల్సీ నాగరాజ యాదవ్ పాల్గొన్నారు.



అశ్వమేధ బస్సుల ప్రారంభంలో సీఎం, తదితరులు

సంగీత రంగానికి బలమైన పునాదులు వేసిన వాగ్గేయ కారులు

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సంగీత రంగానికి వాగ్గేయకారులు బలమైన పునాదులు వేశారని కర్ణాటక ధార్మిక పరిషత్ సభ్యుడు డాక్టర్ ఏ రాధాకృష్ణరాజు పేర్కొన్నారు. బెంగళూరులో పద్మావతి కళానికేతన్ 44వ వార్షిక సంగీతోత్సవం, త్యాగరాజ, పురందరదాస ఆరాధనా మహోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ సంకీర్తనలతో భక్తులు భవంతుడిని ప్రసన్నం చేసుకునే మార్గాన్ని వాగ్గేయ కారులు సులభతరం చేశారన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా త్యాగరాజ, పురందరదాస ఆరాధనా మహోత్స



నృత్యరూపకంలోని ఓ సన్నివేశం



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు

వాలను నిర్వహించుకుంటూ వస్తున్న పద్మావతి కళానికేతన్ నిర్వహకులను గౌరవ అతిథి భారతీయ సంగీత నృత్య కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు విద్వాన్ సాయి నారాయణ్ అభినందించారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో జరిగిన ఈకార్యక్రమంలో గురు డా.చింతలపల్లి జలజా ప్రసాద్, డా.చింతలపల్లి మంగళ భాస్కర్, విదూషి డా.చంద్రికా ప్రహ్లద్, విదూషి స్మిత దేవాసిన్హా, విదూషి భారతి వెంకటేష్, విద్వాన్ చింతలపల్లి శ్రీనివాస్, విద్వాన్ చింతలపల్లి సోమశేఖర్‌లచే కర్ణాటక సంగీతం, పంచరత్న కీర్తనల ఆలాపనా కార్యక్రమం జరిగింది. తదుపరి కళాకారులను వేదికపై ఘనంగా సన్మానించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఆదివారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించినట్లు సంస్థ సంస్థాపక కార్యదర్శి జీవీ వేణుగోపాల్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు

తప్పులు కప్పిపుచ్చుకునేందుకు ఢిల్లీలో ధర్నా నాటకం : బీజేపీ

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేంద్రంపై అభాండాలు వేస్తోందని బీజేపీ మండిపడింది. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ రాజీవ్ వేర్వేరుగా సోమవారం మీడియా సమావేశాలు నిర్వహించారు. బొమ్మై ఆర్టీనగర్‌లోని తన నివాసంలో మాట్లాడుతూ ఢిల్లీలో 7న కాంగ్రెస్ చేపట్టదలిచిన ధర్నా రాజకీయ స్టంట్‌లో భాగమన్నారు. రాష్ట్రంలో గత 9 నెలలుగా అభివృద్ధి కోసం ఒక్కపైసా విడుదల చేయలేదన్నారు. 15వ ఆర్థిక సంఘానికి సరైన సమాచారం లేకపోవడం వల్లే నిధుల కేటాయింపు 4.7శాతం నుంచి 3.6 శాతానికి తగ్గిందన్నారు. యూపీఏ అవధితో పోలిస్తే ఎన్డీయే అవధిలో రాష్ట్రానికి విడుదలైన గ్రాంట్లపై తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆయన సవాల్ విసిరారు. గత పదేళ్ల అవధిలో కేంద్రం, రాష్ట్రానికి మంజూరు చేసిన నిధుల వివరాలను సమగ్రంగా మీడియాకు విడుదల చేశారు. గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా పీ రాజీవ్ మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తమ వైఫల్యాలను కప్పిపుచ్చు కునేందుకు కేంద్రాన్ని టార్గెట్ చేయడం సిద్దరామయ్యకు అలవాటేనన్నారు. పాల ఉత్పత్తిదారులకు రూ.617 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా ఇంతవరకు పైసా విడుదల చేయలేదని ఆరోపించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలలో ఈ అన్ని అంశాలపై తమ పార్టీ చర్చకు సిద్ధంగా ఉందన్నారు. ఢిల్లీలో జరుగుతున్న సమావేశం రాజకీయ రంగు పులుముకోవడంతో రాష్ట్ర ప్రయోజనాలు మచ్చుకైనా లేవని అందుకే తమ ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొనబోమని స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజీవ్

భూముల అక్రమాలపై నిరసన



తాలూకా కార్యాలయం వద్ద కర్ణాటక రిపబ్లిక్ సేన ఆధ్వర్యంలో నిరసన

బంగారపేట, ఫిబ్రవరి 5: ఎస్సీ సామాజికవర్గానికి చెందిన రైతులకు ఇనాం భూములను కేటాయించగా కొంతమంది భూమాఫియాదారులతో తహసీల్దార్ రశ్మి సదరు రికార్డులను పరిశీలించకనే మరొకరికి ఇచ్చారని ఆరోపిస్తూ కర్ణాటక రిపబ్లిక్ సేన (కేఆర్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. తాలూకా కార్యాలయం వద్ద కేఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చిక్కనారాయణ నేతృత్వంలో డప్పుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా చిక్కనారాయణ మాట్లాడుతూ బూదికోటె హోబళి మారాండహళ్ళికి చెందిన కోటప్పకు నిబంధనలకు వ్యతిరేకంగా భూమిని కేటాయించారని ఇందులో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయన్న అనుమానాలు ఉన్నాయన్నారు. దశాబ్దాలక్రితం హక్కుంద సీనప్ప, గంగప్ప, యల్లప్ప, మునిరాజు, గంగమ్మ, ఆంజినప్ప, కొండనహళ్ళి వెంకటేశ్, కారమానహళ్ళి చిన్నయ్యలకు వేర్వేరు సర్వే నెంబర్లలో 48 ఎకరాలకుపైగా భూమిని కేటాయించిందన్నారు. వారి వద్ద భూమికి సంబంధించిన పహణి, ముటేషన్, వంశవృక్షం, మంజూరు పత్రం ఉన్నాయన్నారు. అయితే తహసీల్దార్ రశ్మి మాత్రం కోటప్పకు భూమిని ఇష్టం వచ్చినట్టు గుడ్డిగా కేటాయించడం ద్వారా రైతులకు అన్యాయం చేశారన్నారు. నియమాలను ఉల్లంఘించి కేటాయించిన భూమిని రద్దు చేయాలని లేనిపక్షంలో లోకాయుక్తకు ఫిర్యాదు చేసి న్యాయపోరాటం చేయనున్నట్టు తెలిపారు. నిరసనలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింటు రామచంద్ర, జిల్లా గౌరవాధ్యక్షుడు ఏ రమేశ్, కార్మిక విభాగం జిల్లాధ్యక్షుడు వీ అమరేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ శ్రీనాథ్, న్యాయవాది హుక్కుంద వెంకటేశ్, తాలూకా అధ్యక్షుడు పీ చంద్రప్ప, తిప్పయ్య, మాచా వేణుగోపాలరెడ్డి, దివ్య, హంసవేణి, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

మహదేవపుర, ఫిబ్రవరి 5: వేసవి ఆరంభం కాకమునుపే తాగునీటి సమస్య తలెత్తిందని తక్షణం పరిష్కరించాలని కోరుతూ పాలికె కార్యాలయాన్ని వర్తూరు ప్రాంత గ్రామస్థులు సోమవారం ధర్నా చేపట్టారు. నియోజకవర్గంలోని వర్తూరు పరిధిలో కొంతకాలంగా నీటి ఎద్దడి ఉంది. తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. స్వాభిమాని సంఘం అధ్యక్షుడు కుప్పి మంజునాథ్ మాట్లాడుతూ గతంలో 5వేలమంది జనాభా ఉండేవారని రెండు బోర్లతో నీటిని సమకూర్చేవారన్నారు. వర్తూరు ప్రాంతం క్రమేపీ అభివృద్ధి సాగుతున్నా కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ప్రస్తుతం 25వేల మందికిపైగా జనాభా ఉన్నారని, బోర్లను తవ్వించడానికి బదులు 2013-18 అవధిలో సిద్దరామయ్య హయాంలో కావేరినీటిని సమకూరుస్తామని హామీ ఇచ్చారని అయితే అమలులోకి రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా బీబీఎంపీ అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. ధర్నాలో విజయకుమార్, వరపురి నారాయణస్వామి, జేకే రవి, శ్రీనివాస్, జగదీశ్‌రెడ్డి, రవిశంకర్, సరోజ, లక్ష్మీగోపాల్ రావ్, మంజుళా తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో గ్రామస్థుల నిరసన

యోగా పోటీల్లో రాణించిన యాశిక



ట్రోఫీ అందుకుంటున్న యాశిక

చింతామణి, ఫిబ్రవరి 5: కర్ణాటక రత్న డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ స్మరణార్థం రెండవ జాతీయ యోగాసన క్రీడాచాంపియన్‌షిప్ పోటీల్లో చింతామణికి చెందిన యోగా విద్యార్థిని యాశిక బందిత కే పాల్గొని యోగాకప్ సాధించి జిల్లా, తాలూకాకు కీర్తి తెచ్చింది. బెంగళూరులోని గుండూరావ్ క్రీడా మైదానంలో ఆదివారం పోటీలు జరిగాయి. 10-15 ఏళ్ల విభాగంలో యాశిక బందిత ప్రథమస్థానంలో నిలిచింది. అంతేకాక ఇతర విభాగాల్లోనూ యాశిక తన ప్రతిభను చాటుకుంది. తాలూకాలోని కురుబూరు పట్టు విశ్వ విద్యాలయంలోని వ్యవసాయ విజ్ఞాన కేంద్రంలో పనిచేస్తున్న సైంటిస్ట్ అరుణా, కార్తీక్‌ల కుమార్తె యాశిక. పట్టణంలోని జైన్ పబ్లిక్ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. 2016 నుంచి ఇప్పటివకు పలు రాష్ట్ర, జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న యాశిక రాణించారు. యోగా గురువులు గోవింద్, నందిని గోవింద్‌ల వద్ద తర్ఫీదు పొందుతున్నారు. యోగా జాతీయపోటీల్లో రాణించిన యాశికను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

మహదేవపుర, ఫిబ్రవరి 5: దక్షిణ వలయ పురుషులు, మహిళల ఫ్లడ్‌లైట్ వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మాజీ మంత్రి అరవింద లింబావళి 57వ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 1 నుంచి 4వరకు నిర్వహించిన ఆదివారం సాయంత్రం ఏర్పాటైన కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి ప్రదానం చేశారు. హూడి స్పోర్ట్స్ క్లబ్‌లో ఏర్పాటైన పోటీల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో ఫైనల్స్‌లో నైరుతి రైల్వే హుబ్బళ్ళి జట్టు ట్రోఫీని కైవశం చేసుకుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి జట్లు వరుసగా రెండవ, మూడవ, నాల్గవ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో కేరళ రాష్ట్ర పోలీస్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. సికింద్రాబాద్‌కు చెందిన దక్షిణ మధ్య రైల్వే, జీపీఆర్ తమిళనాడు, కర్ణా టక జట్లు వరుసగా ద్వితీయ, తృతీయ, చతుర్థి స్థానాల్లో నిలిచాయని హూడి హెచ్ఎస్ పిళ్ళప్ప తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహరరెడ్డి, పోటీల నిర్వాహకులు, రూరల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి హూడి పిళ్ళప్ప, బిదరహళ్ళి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.




ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

గోముల్కా (జయంతి)



పోలిష్ కమ్యూనిస్టు రాజకీయ నేతగా పేరొందిన గోముల్కా 1905 ఫిబ్రవరి 6న ఆస్ట్రియా-హంగేరి దేశం (ప్రస్తుతం పోలెండ్)లో జన్మించారు. పోలిష్ యునైటెడ్ వర్కర్స్ పార్టీకి తొలి కార్యదర్శి. దశాబ్దాల పాటు ఆయన అనధికారికంగా శాసించారు. సోష లిజంవైపు సాగిన ఆశయాలు 'గోముల్కా థా'గా పేరొందాయి. 1982 సెప్టెంబరు 1న కన్నుమూశారు.

రోనాల్డ్ రీగన్ (జయంతి)




అమెరికా దేశ 40వ అధ్యక్షుడిగా వ్యవహరించిన రోనాల్డ్ విల్సన్ రీగన్ 1911 ఫిబ్రవరి 6న జన్మించారు. 1981 నుంచి 1989వరకు రెండు సార్లు రిపబ్లికన్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. సోవియట్ యూనియన్‌లోని అమెరికా, రష్యాల మధ్య దశాబ్దాల పాటు సాగిన శీతల సమరాన్ని పరిష్కరించి ప్రజల ఆదరణ పొందారు. అధ్యక్షుడు కాక మునుపు కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్‌గా, రేడియో, దూరదర్శన్, సినిమా నటుడిగా పనిచేశారు. ఆయన 2004 జూన్ 5న కన్ను మూశారు.

శ్యామశాస్త్రి (వర్ధంతి)



కర్ణాటక సంగీత త్రిమూర్తులలో మూడవ వారైన శ్యామశాస్త్రి 1763 ఏప్రిల్ 26న తంజావూరు జిల్లా తిరువారూరు గ్రామంలో జన్మించారు. అసలు పేరు 'వేంకట సుబ్రహ్మణ్యం'. వాగ్గేయకారులైన త్యా గరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి సంగీత త్రిమూర్తులుగా పేరొందారు. శ్యామశాస్త్రి స్వయంగా కామాక్షిదేవి ఉపాసకులు. తెలుగు, సంస్కృ తంలలో పండితులు. కలగడ, మాంజి, చింతామణి రాగాలను కల్పించారు. మధుర మీనాక్షిదేవిని స్తుతిస్తూ ఆలపిం చిన తొమ్మిది కృతులు 'నవరత్నమాలిక'గా పేరొందింది. ప్రత్యేకించి ఆనంద భైరవి రాగంలో పలు కృతులను రచించారు. 1827 ఫిబ్రవరి 6న పరమపదించారు.

దామెర్ల రామారావు (వర్ధంతి)



దేశం గర్వించదగిన చిత్రకారులలో ఒకరైన దామెర్ల రామారావు 1897 మార్చి 8న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. గొల్ల పడుచు, గోదావరి లోయ, పుష్పాలంకారం, ద్రోణుడు, సిద్ధార్థుని రాగోదయం వంటి చిత్రాలు దేశ విదేశాలలో పేరొందాయి. బరోడా మహా రాజు, సంస్థానాధీశుల ప్రశంసలు పొందారు. బ్రిటీష్ ఎంపైర్ ఎగ్జిబిషన్‌లో ఏడాదిపాటు ప్రదర్శన సాగాయి. 1923లో ఒక చిత్రకళా పాఠశాలను స్థాపించి ఎంతో మంది యువకులకు శిక్షణ ఇచ్చారు. ఎంతో అద్భుత ప్రతిభ కల్గిన ఆయన 28ఏళ్లకే 1925 ఫిబ్రవరి 6న అకాలమరణం చెందడం విషాదకరం.

శివరాజు సుబ్బలక్ష్మి (వర్ధంతి)



శివరాజు సుబ్బలక్ష్మి 1925 సెప్టెంబరు 17న కోనసీమ జిల్లాలోని తాపేశ్వరంలో జన్మించారు. ప్రముఖ రచయిత్రి, చిత్రకారిణి. ఆమె రచనలకు, చిత్రలేఖనాలకు కవి, రచయిత అయిన ఆమె భర్త బుచ్చిబాబు (శివరావు వెంకట సుబ్బారావు) స్ఫూర్తినిచ్చారు. ఆమె కథలు అనేక సంకలనాలలో వెలువడ్డాయి. గృహలక్ష్మి, స్వర్ణ కంకణం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, తెలుగు విశ్వ విద్యాలయంచే ప్రతిభా పురస్కారం అందు కున్నారు. 2021 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

లతా మంగేష్కర్ (వర్ధంతి)



భారతరత్న, పద్మభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలు అందుకున్న దేశం మెచ్చిన నేపథ్య గాయని లతా మంగేష్కర్ 1929 సెప్టెంబరు 28న ఇండోర్‌లో జన్మించారు. అత్యధికంగా వెయ్యికిపైగా హిందీ సినిమా లకు పాటలు పాడారు. ఎనిమిది దశాబ్దాలలో స్వదేశీ, విదేశీ భాషలు కలిపి మొత్తం 36 భాషల్లో పాటలు పడిన ఘనత ఆమెది. నైటింగేల్ ఆఫ్ ఇండియా, దాదాసాహెబ్ ఫాల్కె, 3 నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్, 15 బెంగాల్ ఫిల్మ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అవార్డులు లెక్కకు మిక్కిలి గౌరవాలు అందుకున్నారు. తండ్రి దీనానాథ్ జ్ఞాపకార్థం 800 పడకల ఆసుపత్రి నిర్మించారు. 2022 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

బస్సు, బైక్ ఢీ.. మహిళ మృతి

▸▸ ప్రాణాలతో బయటపడిన కుమారుడు



నేత్రావతి (ఫైల్)

చింతామణి, ఫిబ్రవరి 5: కేఎస్ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఒక మహిళ మృతి చెందగా మరో యువకుడు గాయాలతో బయటపడ్డాడు. గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోలారురోడ్డు కాచహళ్ళి వద్ద సోమవారం ఉదయం 7 గంటలకు ప్రమాదం జరిగింది. చింతామణి తాలూకా హాదిగెరె గ్రామానికి చెందిన నేత్రావతి (43) మృతి చెందింది. ఆమె కుమారుడు రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. హాదిగెరె నుంచి చింతామణికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కోలారు నుంచి చింతామణి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీ కొంది. ప్రమాదంలో బస్సు చక్రం కింద ఇరుక్కున్న ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందగా బైక్ నడుపుతున్న రాజు గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందు కున్న చింతామణి రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని, క్షతగాత్రుడిని చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సును, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రమాదం కారణంగా కుటుంబంలో విషాదం నెలకొంది.

విధానపరిషత్‌కు జర్నలిస్టు నామినేట్

▸▸ సభాపతి ప్రతిపాదనపై జర్నలిస్టు సంఘాల హర్షం

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విధానపరిషత్‌కు సీనియర్ జర్నలిస్టును నామినేట్ చేసే సంప్రదాయాన్ని పునరుద్ధరించాల్సిందిగా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సూచిస్తానని సభాపతి బసవరాజ హొరట్టి చేసిన ప్రకటనపై జర్నలిస్టు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు శివానంద తగడూరు నగరంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ హిందూ సీనియర్ పాత్రికేయుడు రామయ్య అవధి ముగిసిన తర్వాత ఈ పదవిలో ఎవర్నీ నియమించలేదన్నారు. కాగా బెంగళూరు ప్రెస్‌క్లబ్, బెంగళూరు రిపోర్టర్స్ గిల్డ్ కూడా సభాపతి నిర్ణయాన్ని స్వాగతించాయి. రాష్ట్ర పాత్రికేయుల తదుపరి రాష్ట్ర సమావేశం తుమకూరులో జరుగుతుందన్నారు. దావణగెరెలో ఆదివారం ముగిసిన సమావేశంలో మొత్తం 8 ప్రముఖ తీర్మానాలను ఆమోదించామన్నారు. పాత్రికేయులందరికీ ఉచిత బస్సు పాసుల కేటాయింపు, ఆరోగ్య సంక్షేమ పథకం, పాత్రికేయులకు రాయితీ ధరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పాత్రికేయుల కుటుంబాల్లోని విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్, పాత్రికేయులు ప్రమాదాలు లేదా సహజంగా మృతి చెందినా తక్షణం రూ2 లక్షల పరిహారం, పాత్రికేయుల వాహనాలకు ఉచితంగా టోల్ సదుపాయం వంటివి ఉన్నాయన్నారు. తమ డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించారని వీటిలో కొన్నింటిపై బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు.

జేడీఎస్‌లో చేరిన మాజీ ఐపీఎస్ అధికారి

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఐపీఎస్ అధికారి జ్యోతి ప్రకాశ్ మిర్జి జేడీఎస్‌లో చేరారు. పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం కుమారస్వామి సమక్షంలో సోమవారం జేడీఎస్ కండువా కప్పుకున్నారు. జ్యోతి ప్రకాశ్ మిర్జి బెంగళూరు నగర కమిషనర్‌గానే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో సేవలందించారు. కార్యక్రమంలో జేడీఎస్ యువనేత నిఖిల్‌తోపాటు ముఖ్య నాయకులు ఉన్నారు.



పార్టీ జెండాను అందజేస్తున్న కుమారస్వామి

చిక్కబళ్లాపుర నుంచి లోక్‌సభకు పోటీ చేస్తా

▸▸ మాజీ మంత్రి సుధాకర్

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర లోక్‌సభ నుంచి తాను పోటీ చేస్తానని, అందుకు మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ కూడా అంగీకరించారని మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మా ట్లాడుతూ జేడీఎస్ నుంచి అంగీకారం లభించినందున బీజేపీ ద్వారా టికెట్ సాధ్యం కానుందన్నారు. ఇప్పటికే ప్రక్రియ ఆరంభించుకోవాలని సూచించారన్నారు. ఎంపీగా గెలిస్తే నియోజకవర్గ అభివృద్ధి వేగవంతం చేస్తానన్నారు. సాగు, తాగునీటికి ప్రాధా న్యత ఇస్తానని యువతకు ఉద్యోగాలు పెంచుతామన్నారు. అగ్రనేతలు సూచించిన మేరకు చాకవేలు ప్రాంతం నుంచి ఎన్నికల ప్రచారం ఆరంభించానన్నారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చిన సుధాకర్ ఇటీవల ఎన్నికలలో ఓడిపోయారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల బరిలో దిగేందుకు అగ్రనేతలతో చర్చలు సాగిస్తున్నారు. కాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు విజయేంద్ర ఓ సమావేశంలో ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఏ స్థానానికి అభ్యర్థులను ఖరారు చేయలేదని స్పష్టం చేశారు.

మార్చి 31న బహుభాషా గానలహరి

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి గాయక సమ్మేళనం బహు భాషా గానలహరి నగరంలో మార్చి 31న కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో జరుగనుంది. ఉగాదిని పురస్కరించుకుని తొలిసారి ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సమాఖ్య నగరంలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి గలవారు ఈ నెల 28లోపు తాము పాడదలిచే పద్యం, పాటను 9538400022 అనే నెంబరుకు వాట్సాప్‌లో పంపుకోవాల్సి ఉంటుంది. లలిత, భక్తి, ఆధ్యాత్మిక, పద్య, వచన, యుగళ, సినీ, జానపద ఇతర గీతాలను ఎంచుకోవచ్చునని ఎంపికైన గాయకులకు మాత్రమే గాన లహరి సమ్మేళనంలో పాల్గొనే అవకాశం లభిస్తుందని ప్రకటనలో సంస్థ పేర్కొంది. ఎంపికైన నలుగురు ఉత్తమ గాయకులకు నగదు పురస్కారాలు ఉంటాయని పాల్గొనే గాయకులందరికీ జ్ఞాపికలను ప్రదానం చేయడం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు. ఈ పోటీ బెంగళూరు కల్యాణ్‌నగర్‌లోని ఇండో ఏషియన్ అకాడమీ క్యాంపస్‌లో ఆ రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు.

అలరారిన కళాఖండాలు



బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 2024 వార్షిక డెస్క్‌టాప్ కేలండర్ కోసం 12 మంది కళాకారులు నోటితో పండ్ల రంగులతో అద్భుతమైన కళాఖండాలను సృష్టించారు. మౌత్, ఫ్రూట్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేన్ సహకారంతో ఈ వినూత్న ప్రయోగాన్ని ది లీలా ప్యాలెస్ చేపట్టింది. సంస్థకు చెందిన అనురాగ్ భట్నాగర్ ఈ మేరకు నగరంలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాకారులను ఇలా వెన్ను తట్టి పోత్సహిస్తున్న సంస్థను ఆర్టిస్ట్ అసోసియేషన్ బాబా థామస్ ప్రత్యేకంగా అభినందించారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలలో ది లీలా ముందుంటోందని ఆమె ప్రశంసించారు.

మాల్‌లో యువకుడితో తిరిగిందని..

యువతి ఇంటిపై దాడి

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం బన్నేరుఘట్ట రోడ్‌లోని ఓ మాల్‌లో యువకుడితో తిరిగారని భావించి యువతి ఇంటిపై దాడికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి పొద్దుపోయాక చోటు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తనూరు పరిధిలో శరణ్‌కుమార్ అనే యువకుడు నివసిస్తున్నాడు. ఇదే ప్రాంతంలోని బిళిశివాలె కాలనీలో యువతి నివసిస్తోంది. సదరు యువతి ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను శరణ్‌కుమార్ వద్ద కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణాలు పూర్తికాగా అక్కడే యువతి కుటుంబం నివసిస్తోంది. ఇలా పరిచయం ఉండే శరణ్‌కుమార్‌తో కలిసి యువతి ఓ మాల్‌లో తిరిగారు. విషయం కాస్త శరణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు తెలిసింది. యువకుడి బంధువులలో ఇద్దరు వ్యక్తులతో పాటు ఓ మహిళ శుక్రవారం రాత్రి దాదాపు 12గంటల వేళ యువతి ఇంటికి వెళ్లారు. ఇంటి నిర్మాణాల మెటీరియల్ నగదు ఇంకా ఇవ్వలేదని గొడవకు దిగారు. శరణ్‌తో నీకు ఏం సంబంధమని మాల్‌లో తిరిగావంటూ విధ్వంసం చేశారు. ఏకంగా ఇంటి తలుపులు, కిటికీల అద్దాలను పగులకొట్టారు. ఇంటి బయట ఉండే రెండు కార్లు, ద్విచక్రవాహనాలను ధ్వంసం చేశారు. నాకు శరణ్‌తో ఎటువంటి సంబంధం లేదని ఇంటికి వస్తువుల కోసం మాల్‌కు వెళితే కనిపించారని తెలిసిన వారు అయినందున పలకరించానన్నారు. ఇంటిపై దాడి చేస్తున్న వేళ పోలీసులకు ఫోన్ చేస్తే హొయ్సళ వాహనం వచ్చి వారిని స్టేషన్‌కు తీసుకెళ్ళిందని బాధిత యువతి వాపోయారు. ఇంట్లో నాతో పాటు చెల్లి, తండ్రి ఉంటామని తీవ్రంగా దూషించారని, హతమారుస్తామని బెదిరించారని యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కొత్తనూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పెళ్లి చేయలేదని..

మద్యం మత్తులో తల్లి దారుణహత్య

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పెళ్ళి చేయలేదని మద్యం మత్తులో ఏకంగా కన్నతల్లిని దారుణంగా కొట్టి కుమారుడు హత్య చేసిన సంఘటన కలబురగి జిల్లాలో చోటుచేసుకుంది. చించోళి తాలూకా పోచావరం గ్రామానికి చెందిన శోభా(45) హత్యకు గురైన వారు. తల్లితో పాటు కుమారుడు అనిల్ నివసిస్తున్నారు. ఇటీవల కొంతకాలంగా అనిల్ మద్యం మత్తుకు బానిసయ్యాడు. ఆదివారం మద్యం మత్తులో అనిల్ ఇంటికి వచ్చాడు. ఇలా మద్యం తాగి చిందులేస్తేంటే సంసారం ఎలా సాగాలని తల్లి మందలించారు. అంతలోనే నా తోటివారికి పెళ్ళిళ్ళు అయ్యాయని నాకెందుకు చేయడం లేదని వాగ్వాదానికి దిగాడు. తల్లి కూడా తీవ్రంగా మందలించడంతో ఆగ్రహానికి లోనైన కుమారుడు కట్టెతో చితకబాదాడు. తలపై బలంగా కొట్టడంతో ఆమె కుప్పకూలిపోయింది. స్పృహ కోల్పోయిన ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా గొడవ జరు గుతోందని వచ్చిన స్థానికులు ఆమె మృతి చెందినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుంచావరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సమగ్ర విచారణలు జరుపుతున్నట్లు తెలిపారు. అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.